సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 1 । ఏప్రిల్ । 2024



గెలుపెవరిదో..?

పార్లమెంట్ ఎన్నికలపై జనంలో చర్చ మొదలైంది. ఎస్టీ రిజర్వ్ అయిన ఆదిలాబాద్ స్థానంలో ఏ పార్టీ గెలుస్తుందనేది ఆసక్తికరంగా మారింది. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ : 6:31	మంగళ : 4:47

గరిష్టం/కనిష్టం 39.0/26.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

నిబద్ధతతో కూడిన వైద్యం అందించాలి



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న జూనియర్ డాక్టర్లు

ఆదిలాబాద్‌టౌన్: వైద్యులు నిబద్ధతతో కూడిన వైద్యం అందించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. జూనియర్ డాక్టర్ల అప్రెంటిషిప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వారికి మానవ విలువలు అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి తెలంగాణ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ శ్రీనివాస్ యేగన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్యులు రోగులకు వైద్యం అందించే సమయంలో మానవతదృక్పథంతో మెలగాలని సూచించారు. రోగి బాధను తెలుసుకొని వారికి ధైర్యం చెప్పాలన్నారు. క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం టీఎంసీ మెంబర్‌ను జూనియర్ డాక్టర్లు సన్మానించారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగి జుడీషియల్ కస్టడీ పూర్తి

ఆదిలాబాద్‌టౌన్: రైతు ఖాతాల్లోని డబ్బులను తన సొంత ఖాతాలోకి మళ్లించుకున్న ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ఉద్యోగి జాదవ్ విజయ్ జుడీషియల్ కస్టడీ ఆదివారం పూర్తయింది. దీంతో ఆయనను జిల్లా జైలుకు తరలించారు. పోస్టల్ ఉద్యోగిని ఈ కేసుకు సంబంధించి విచారించేందుకు ఇటీవల వన్‌టౌన్ పోలీసులు కోర్టులో జుడీషియల్ కస్టడీ కోసం దరఖాస్తు చేయగా జడ్జి పది రోజుల పాటు విచారించేందుకు అనుమతించారు. రైతులకు సంబంధించి రూ.1కోటి 13 లక్షల నిధులను కాజేసినట్లు విచారణలో తేలినట్లు సమాచారం. కాగా నిందితుడి నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. త్వరలో కోర్టులో సమర్పించే అవకాశాలు ఉన్నాయి. కాగా ఈ విషయమై ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణను వివరణ కోరగా వారు ధ్రువీకరించారు.

నీటి ఎద్దడి గ్రామాల సందర్శన

సాక్షి ఎఫెక్ట్..

కైలాస్‌నగర్: జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో నీటి ఎద్దడి కారణంగా ప్రజలు ఇక్కట్లకు గురవుతున్న తీరును వివరిస్తూ మార్చి 30న 'దాహం కేకలు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. మిషన్ భగీరథ ఆదిలాబాద్ ఇంట్రా డివిజన్ ఈఈ చంద్రమోహన్ నీటి ఎద్దడి గ్రామాల్లో శనివారం పర్యటించారు. అక్కడి పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు బల్క్ నీటి సరఫరా జరిగే మాటేగాంవ్, ధనోరా ప్రాంతాల్లో నిర్వహణ కారణంగా ఈనెల 26నుంచి 28 వరకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరుగుతుందన్నారు. బోరుబావులు, చేతిపంపులు పనిచేయని ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి మరమ్మతులు చేస్తున్నట్లుగా వివరించారు.

నేడు, రేపు స్పాట్ అడ్మిషన్స్


ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్ ఆధ్వర్యంలో అందజేసే గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు సంబంధించి స్పాట్ అడ్మిషన్లు ఈ నెల 1, 2 తేదీలలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సునీత కుమారి, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ రమేశ్ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఎస్సీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో జిల్లా కేంద్రంలోని రాంగనగర్‌లో గల ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని సూచించారు.

'జోగు' వాహనం తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న వాహనాన్ని ఎన్నికల విభాగం సిబ్బంది ఆదివారం తనిఖీ చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామానికి వెళ్తుండగా అనుకుంట వద్ద ఆయన వాహనాన్ని ఆపి తనిఖీలు చేశారు. మాజీ మంత్రి వారికి పూర్తిగా సహకరించారు.



భీంపూర్ మండలం బెల్సరిరాంపూర్‌లో పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి (ఫైల్)

లక్ష్యం.. చేరలే!

- గ్రామ పంచాయతీల పన్ను వసూళ్లు 85శాతమే
- ఇచ్చోడ టాప్... ఉట్నూర్ లాస్ట్
- రాష్ట్రస్థాయిలో 11వ స్థానంలో జిల్లా
- మైదానంతో పోల్చితే ఏజెన్సీ గ్రామాలే నయం

కైలాస్‌నగర్: 2023–24 ఆర్థిక సంవత్సర గడువు ఆదివారంతో ముగిసింది. ఈ ఏడాదికి గాను జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీల్లో 85శాతం మాత్రమే ఆస్తి పన్ను వసూళ్లయ్యాయి. వసూళ్లలో ఇచ్చోడ మండలం 105శాతంతో అగ్రస్థానంలో నిలువగా ఉట్నూర్ మండలం 67శాతంతో అట్టడుగున నిలిచింది. మైదాన ప్రాంతంతో పోల్చితే ఏజెన్సీ పరిధిలోని పంచాయతీల్లోనే అత్యధికంగా వందశాతం పన్నుల వసూళ్లు నమోదవడం గమనార్హం. పన్నులు చెల్లించడంలో గిరిజనేతరులతో పోల్చితే గిరిజనులు ఆదర్శంగా నిలిచారు. రూ.5కోట్ల 23లక్షల 6వేల113ల పన్నుల వసూలుతో రాష్ట్రస్థాయిలో జిల్లా 11వ స్థానంలో నిలిచింది.

అగ్రస్థానంలో ఇచ్చోడ

జిల్లాలో మొత్తం 468గ్రామ పంచాయతీలున్నాయి. ఆర్థిక సంవత్సర గడువు ముగిసే ఆదివారం నాటికి 294 జీపీలు వందశాతం పన్ను వసూలు లక్ష్యం పూర్తిచేశాయి. 174పంచాయతీలు వెనుకబడి ఉన్నాయి. 32జీపీలు కలిగిన ఇచ్చోడ మండలం 105 శాతం పన్నుల వసూలుతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ మండలంలో 29 గ్రామ పంచాయతీలు వందశాతం పన్నులను సేకరించాయి. గేర్జం, అడేగామ, మాదాపూర్ పంచాయతీలు మాత్రమే వెనుకబడ్డాయి. ఇక 37 గ్రామ పంచాయతీలు కలిగిన ఉట్నూర్ మండలం పన్నుల వసూళ్లలో వెనుకబడింది. కేవలం 67శాతం మాత్రమే వసూలు చేసి అట్టడుగున నిలిచింది. ఈ మండలంలో కేవలం 14 జీపీలు మాత్రమే వందశాతం పన్నులు వసూలు చేయగా.. మిగతావి 85శాతం నుంచి 92శాతం మధ్యలో నిలిచాయి. లక్ష్య సాధనలో మైదాన ప్రాంత పంచాయతీలతో పోల్చితే గిరిజన పంచాయతీలే ఎక్కువగా ఉండటం గమనార్హం. గిరిజనులు బాధ్యతగా పన్నులు చెల్లిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

రూ.5.23 కోట్లు వసూలు..

జిల్లాలోని ఆయా పంచాయతీల పరిధిలో 1,76,383 ఆస్తులున్నాయి. వీటికి గాను గతేడాది బకాయిలు రూ.31,83,994 ఉండగా అందులో రూ.19,26,769 వసూలయ్యాయి. ఈ ఏడాదికి గాను రూ.5కోట్ల 86 లక్షల 91వేల 816 పన్నుల లక్ష్యం కాగా రూ.5కోట్ల 3లక్షల 78వేల 344 పన్నులు వసూలయ్యాయి. మొత్తంగా రూ.6,18,75,810 పన్నుల లక్ష్యం కాగా ఇందులో రూ.5,23,06,113 పన్నులు వసూలయ్యాయి. ఇంకా బకాయిలు రూ.12,57,225 మిగిలి ఉండగా ఈ ఏడాది పన్నులు రూ.83,10,329 మిగిలిపోయాయి. ఇవి రెండు కలిపి ఇంకా రూ.95,67,554 వసూలు చేయాల్సి ఉంది. గడువు ముగియడంతో ఇవి మరో ఆర్థిక సంవత్సరం ఖాతాలో చేరనున్నాయి. ఫలితంగా ఏరియర్స్‌గా మారనున్నాయి. కాగా పన్నుల వసూళ్లలో మావల మండల పరిస్థితి అధ్వానంగా ఉంది. మావలలో 92శాతం, వాఘాపూర్‌లో 79శాతం, బట్టి సావర్‌గాంవ్‌లో 74శాతం మాత్రమే పన్నులు వసూలవడం గమనార్హం.

జిల్లాలో ఆయా మండలాల వారీగా పన్ను వసూళ్ల వివరాలు

మండలం	మొత్తం జీపీలు	వందశాతం వసూలైనవి	సాధించిన లక్ష్యశాతం
ఆదిలాబాద్	34	20	87
బజార్‌హత్నూర్	30	20	90
బేల	37	23	89
భీంపూర్	26	17	93
బోథ్	33	16	83
గాదిగూడ	25	21	96
గుడిహత్నూర్	26	19	88
ఇచ్చోడ	32	29	105
ఇంద్రవెల్లి	28	22	80
జైనథ్	43	29	29
మావల	03	--	83
నార్నూర్	23	16	83
నేరడిగొండ	32	17	87
సిరికొండ	19	08	84
తలమడుగు	28	14	84
తాంసి	13	09	79
ఉట్నూర్	37	14	67

చాపకింద నీరులా.. కుష్ఠు

- జిల్లాలో ప్రస్తుతం 61 మంది వ్యాధిగ్రస్తులు
- 1,367 మంది అనుమానితులు..
- గుర్తింపు ఉద్యమంలో 12 మందికి వ్యాధి నిర్ధారణ
- మరో నాలుగు పీహెచ్‌సీల్లో కొనసాగుతున్న స్క్రీనింగ్

వ్యాధిగ్రస్తుల వివరాలు..

సంవత్సరం	గుర్తించిన వ్యాధిగ్రస్తులు
2017	60
2018	47
2019	43
2022	17
2023	73



అనుమానితులకు స్క్రీనింగ్ చేస్తున్న వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: కుష్ఠు వ్యాధి తగ్గుముఖం పట్టడం లేదు. చాప కింద నీరులా విస్తరిస్తోంది. జిల్లాలో కేసులు నమోదవుతూనే ఉన్నాయి. గత ఆగస్టులో సర్వే సమయంలో 22 కేసులు నమోదు కాగా, ఆరు నెలల్లోపు మరోసారి స్క్రీనింగ్ చేపట్టగా 12 మందికి నిర్ధారణ అయింది. 2027 నాటికి దేశాన్ని కుష్ఠురహితంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కుష్ఠు గుర్తింపు ఉద్యమంలో భాగంగా జిల్లాలో 27 పీహెచ్‌సీల్లో 7లక్షల 68వేల 754 మందికి పరీక్షలు చేశారు. ప్రస్తుతం జిల్లాలో 73 మంది వ్యాధిగ్రస్తులున్నారు. అయితే మరో నాలుగు పీహెచ్‌సీల్లో స్క్రీనింగ్ చేయాల్సి ఉంది. కొంత మంది స్వచ్ఛందంగా పరీక్షలు చేయించుకోకపోవడంతో వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. దీంతో జిల్లాలో వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

1,367 మంది అనుమానితులు..

కుష్ఠు అనేది గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతోంది. అంటు వ్యాధి కావడంతో వ్యాధిగ్రస్తుల నుంచి కుటుంబసభ్యులతో పాటు ప్రజలకు కూడా సోకుతోంది. శరీరంపైన గోధుమ రంగు పోలిన స్పర్శలేని మచ్చల ద్వారా వ్యాధిగ్రస్తులుగా అనుమానిస్తారు. సరైన సమయంలో గుర్తించకపోవడంతో రోజురోజుకు వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది. వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. వ్యాధిగ్రస్తులు తగిన సమయంలో చికిత్స చేయించుకోకపోవడంతో దుష్పరిణామాలు ఎదురవుతున్నాయి. ఆరు నెలల్లోపు గుర్తించకపోవడంతో తీవ్రత పెరిగి వైకల్యం బారిన పడుతున్నారు. గతనెల కుష్ఠు నిర్ధారణ గుర్తింపు ఉద్యమ కార్యక్రమంలో భాగంగా మార్చి 11 నుంచి 24 వరకు జిల్లాలో సర్వే చేపట్టారు. 1,006 మంది ఆశ కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా 7లక్షల 68వేల 754 మందికి పరీక్షలు చేయించగా, 1367 మందిని అనుమానితులుగా గుర్తించారు. మార్చి 27,28,29 తేదీల్లో 24 పీహెచ్‌సీల పరిధిలోని అనుమానితులకు వైద్యాధికారులు పరీక్షలు చేయడంతో 12 కేసులు నిర్ధారణ అయ్యాయి. ఇచ్చోడ, గుడిహత్నూర్, నర్సాపూర్, సైద్‌పూర్ పీహెచ్‌సీల్లో గుర్తించిన అనుమానితులకు నిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉన్నాయి. గతంలో ఈ మండలాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్తులు ఉన్నారు. అయితే మరో ఐదారు కేసులు పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

తగ్గుముఖం పట్టని వ్యాధి..

జిల్లాలో కుష్ఠు తగ్గుముఖం పట్టడం లేదు. గత ఆగస్టులో చేపట్టిన గుర్తింపు సర్వేలో భాగంగా జిల్లాలో 22 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. వ్యాధిని నివారించేందుకు ప్రభుత్వం మరోసారి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆరు నెలల్లోనే 12 కేసులు పెరిగాయి. జిల్లాలో ప్రస్తుతం 61 మంది ఉండగా, కొత్తగా గుర్తించిన 12 మందితో కలిపి 73కు చేరుకుంది. గుర్తించిన వారిలో అంకోలిలో 3, బజార్‌హత్నూర్‌లో 3, ఇంద్రవెల్లిలో 2, శ్యాంపూర్‌లో 1, తలమడుగులో 1, బేలలో 2 మొత్తం 12 మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఇందులో 7 ఎంబీ కేసులు, 5 పీబీ కేసులుగా గుర్తించారు.

కుష్ఠురహిత జిల్లాగా మార్చేందుకు..



కుష్ఠు రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. గతనెల 11నుంచి 24వరకు వ్యాధిగ్రస్తుల సర్వే చేపట్టాం. జిల్లాలో 1367 మందిని అనుమానితులుగా గుర్తించాం. ఇందులో 12 మందికి వ్యాధి సోకినట్లు నిర్ధారించాం. మరో నాలుగు పీహెచ్‌సీలకు సంబంధించి స్క్రీనింగ్ చేపట్టాల్సి ఉంది. వ్యాధి సోకిన వారికి చికిత్స అందిస్తాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. – నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌ఓ

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: బాధిత కుటుంబానికి పోలీసు యంత్రాంగం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా నేరడిగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుంటాల జలపాతంలో విధులు నిర్వహిస్తున్న మార్కండేయ గుండెపోటుతో మరణించగా, ఆదివారం గుడిహత్నూర్ మండలం సీతాగొంది గ్రామంలో గల ఆయన నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా మార్కండేయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేయాలనే సదుద్దేశంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కానిస్టేబుల్ బ్యాచ్ అసోసియేషన్ ద్వారా రూ.2 లక్షల చెక్కుతో పాటు ఆదిలాబాద్ జిల్లా వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున రూ.50వేల చెక్కును మృతుడి భార్య కె.సుజాత, కుమారుడు నిఖిల్‌కు అందజేశారు. ప్రభుత్వపరంగా లబ్ధి త్వరగా అందేలా జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పెంటాల వెంకటేశ్వర్లును ఆదేశించారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన 2000 బ్యాచ్ కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, బి.రవి, సుభాష్, ప్రేమ్, సంపత్, ధర్మపాల్, శ్రీనివాస్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు మరువలేనివి



ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను సన్మానిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగించడానికి పోలీసులు చేసిన సేవలు మరువలేనివని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లాకు చెందిన ఒక ఏఎస్సై, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు ఉద్యోగ విరమణ పొందగా క్యాంప్ కార్యాలయంలో ఆదివారం వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సంఘ విద్రోహ శక్తులతో నిరంతరం పోరాడుతూ ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించేందుకు పోలీసులు చేస్తున్న కృషి మరవలేనిదన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ట్రాఫిక్ ఏఎస్సై రూప్‌సింగ్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ పరశురాం, కె.అశోక్‌ను అభినందించారు. పోలీసు వాహనంలో వారిని ఇంటి వరకు సాగనంపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, సీసీదుర్గం శ్రీనివాస్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, దేవిదాస్, కవిత తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



హెలీకాప్టర్ వద్ద అధికారులు

ఆదిలాబాద్: మహారాష్ట్రలోని ముద్ఖేడ్–పిప్పల్‌కోటి మధ్య ఆదిలాబాద్ మీదుగా సాగుతున్న రెండో రైల్వేలైన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ ప్రకాశ్ ప్రతాప్ అన్నారు. ఆదివారం ఏరియల్ సర్వే ద్వారా పనులను పరిశీలించారు. వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సర్వేకోసం వినియోగించిన హెలీకాప్టర్‌లో ఇంధనం అయిపోవడంతో స్థానిక ఏరోడ్రంలో నిలిపివేశారు. ఇంధనం నింపుకున్న అనంతరం బయలుదేరారు. ఆయన వెంట సహాయ ఇంజినీర్ దినేష్ చౌదరి, సైట్‌ఇంజినీర్ సుబ్బారావు ఉన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్

- ప్రభుత్వాలను కూల్చడమే బీజేపీ లక్ష్యం
- ప్రజా, రైతు వ్యతిరేక పార్టీకి ఎందుకు ఓటేయాలి?
- కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కౌటాల: కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటూ, రాష్ట్రంతోపాటు దేశంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలోని జగదాంబ గార్డెన్‌లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీతక్క హాజరై మాట్లాడారు. దేశంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీతో పేదలకు ఒక్క రూపాయి కూడా లబ్ధి కలుగలేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదని, దేవుళ్ల పేర్లు చెబుతూ మోసం చేస్తున్నారని విమర్శించారు. గాంధీజీని చంపిన పార్టీ బీజేపీ అని ఆరోపించారు. బీజేపీ పాలనలో రైతులు రోడ్డున పడ్డారన్నారు. పంటలకు మద్దతు ధర కోసం ఢిల్లీలో ఆందోళన చేసిన రైతులను బీజేపీ ప్రభుత్వం కాల్చి చంపిందని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వాలను కూల్చడమే బీజేపీ లక్ష్యమని అన్నా రు. పదేళ్లలో అభివృద్ధి చేయకుండా ప్రజా ప్రభుత్వాలను కూల్చిందని ఆరోపించారు. ప్రజలకు, రైతులకు, నిరుద్యోగులకు ఏమీ చేయని బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు.

బీఆర్ఎస్‌కు వేస్తే.. బీజేపీకే..

ఇక రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు కూడా ఓటు వేయొద్దని కోరారు. బీఆర్ఎస్‌కు వేస్తే బీజేపీకి వేసినట్లే అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి పదవి ఆశించలేదని తెలిపారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇంట్లో ఉండే వెడ్మ బొజ్జుకు, ఆదివాసీ పేద బిడ్డ ఆత్రం సుగుణకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇచ్చిందని తెలిపారు. ఆదిలాబాద్ బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు ఒకరు దొర, మరొకరు ప్రజలకు దొరకడని ఎద్దేవా చేశారు. కార్యకర్తలు, నాయకులు ప్రజల మధ్య ఉండే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యాక మొదటి పర్యటన ఆదిలాబాద్ నుంచే ఉంటుందని తెలిపారు.

ప్యాకేజీ ప్రవీణ్‌కుమార్

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్యాకేజీ ప్రవీణ్‌కుమార్ అని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కుట్రలో భాగంగా తాను ఓడిపోయానని తెలిపారు. ఆర్ఎస్పీ బడుగు బలహీనవర్గాలను మోసం చేశాడని ఆరోపించారు. కేసీఆర్ వద్ద ఉన్న రూ.1,400 కోట్ల ఆస్తిని లాక్కునేందుకే ఆర్ఎస్పీ బీఆర్ఎస్‌లో చేరాడన్నారు. ఆర్ఎస్పీ బీఆర్ఎస్‌లో చేరిన వెంటనే కవిత అరెస్ట్ అయిందన్నారు. అనంతరం బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి కాంగ్రెస్‌లో చేరగా మంత్రి సీతక్క కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు మాజీ సర్పంచులు, పలువురు నాయకులు పార్టీలో చేరారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.విశ్వప్రసాద్, జిల్లా పరిషత్ ఇన్‌చార్జి చైర్మన్ కోనేరు కృష్ణారావు, సిర్పూర్, ఆసిఫాబాద్ పార్టీ ఇన్‌చార్జీలు రావి శ్రీనివాస్, శ్యాంనాయక్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, ఎంపీపీ దుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ సభ్యులు డొంగ్రి అనూష, దుబ్బుల శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి రైతుల ఉసురు..

తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్న రైతులపై బీజేపీ ప్రభుత్వం దాడులు చేసి చంపేస్తోందని, ఆ పార్టీకి రైతుల ఉసురు తగులుతుందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. ఆదివాసీల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశానని, తనపోరాటాలు చూసి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిందని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు నా గెలుపును బహుమానంగా ఇవ్వాలనుకుంటున్నానన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దోచుకుందని ఆరోపించారు. జీవో 317తో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో నిధులు లేకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు.

తనిఖీలు ముమ్మరం



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో డీఎస్పీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆదివారం తనిఖీలు చేపట్టారు. ప్రయాణికులు, వారి బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం, నగదు అక్రమంగా జిల్లాలోకి తరలిరాకుండా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. మహారాష్ట్ర సరిహద్దులోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలతో తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు

క్లుప్తంగా

ఒకరిపై కేసు

నేరడిగొండ: మండలంలోని దేవల్‌నాయక్ తండా గ్రామానికి చెందిన మాన్‌సింగ్‌పై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. తనిఖీల్లో భాగంగా గ్రామంలోని ఆయన కిరాణ షాప్‌లో సోదాలు చేపట్టగా అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం లభించినట్లు పేర్కొన్నారు. వీటి విలువ రూ.2600 ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైన అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బెల్ట్‌షాపులపై దాడులు



పట్టుకున్న మద్యంతో సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, సిబ్బంది

ఇచ్చోడ: ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు మండలంలోని సిరిచెల్మలో బెల్ట్‌షాపులపై సీసీఎస్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కేశవ్‌గౌడ్ నుంచి రూ.16 వేల మద్యం, సురేందర్‌గౌడ్ నుంచి రూ.18 వేల మద్యం పట్టుకున్నట్లు తెలిపారు. మద్యం విక్రయిస్తున్న వీరిని, బాటిళ్లను ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు పేర్కొన్నారు.

108లో ప్రసవం



జన్నారం: మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన గర్భిణి శ్యామల 108 అంబులెన్స్‌లో ప్రసవించి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు ఆదివారం 108 సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని వాహనంలో ఆమెను జన్నారానికి వస్తున్నారు. మార్గమధ్యలో పురిటినొప్పులు రావడంతో వాహనంలో ప్రసవించగా పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను జన్నారం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్లు ఈఎంటీ కిషన్, పైలట్ రఫీక్ తెలిపారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

కౌటాల: హోలీ సందర్భంగా మండలంలోని తాటిపల్లి వద్ద వార్ధా నదిలో సాన్నాలకు వెళ్లి యువకులు మృతిచెందిన విషయం తెలిసిందే. బాధిత తల్లిదండ్రులు ఆదివారం కౌటాలలో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్కను కలిశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఆ సమయంలో వారు బోరున విలపించగా మంత్రి వారి కన్నీటిని తుడిచి ఓదార్చారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ఆదివాసీ నాయకులు, పంచాయతీ కార్మికులు, ఐకేపీ సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి పత్రం అందించారు.



శివాజీ చౌక్ చౌరస్తాలో ప్రయాణికులు



బస్సు షెల్టర్ లేక పండ్ల వ్యాపారి ఏర్పాటు చేసిన గొడుగు నీడలో..



బస్ డిపో వద్ద ఎండలో..



ఖానాపూర్ మంచిర్యాల వెళ్లే దారిలో ఎండలో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఎండలో 'ప్రయాణికుల' ఎదురుచూపు

నిర్మల్‌లోని పలు చౌరస్తాల్లో ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండేందుకు బస్సు షెల్టర్లు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు దంచికొడుతున్నాయి. బస్టాప్‌ల వద్ద ప్రయాణికులు చిన్న పిల్లలతో ఎండలో నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. రద్దీగా ఉండే శివాజీ చౌక్ చౌరస్తాలో మంచిర్యాల, నిజామాబాద్, హైదరాబాద్, భైంసా వైపు వెళ్లే ప్రయాణికుల కోసం బస్సు షెల్టర్ లేక రోడ్డుపైన వేచిచూడాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి బస్సు షెల్టర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

గెలుపెవరిదో?

- ఎస్టీ రిజర్వ్‌డ్ తర్వాత వేర్వేరు పార్టీలకు దక్కిన విజయం
- సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోని వైనం



సంవత్సరం	గెలిచినపార్టీ	అభ్యర్థి
2009	టీడీపీ	రాథోడ్ రమేశ్
2014	బీఆర్ఎస్	గోడం నగేశ్
2019	బీజేపీ	సోయం బాపురావు

సాక్షి,ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికలపై జనాల్లో చర్చ మొదలైంది. ఎస్టీ రిజర్వ్ అయినటువంటి ఆదిలాబాద్ స్థానంలో ఏ పార్టీ గెలుస్తుందనేది ఆసక్తికరంగా మారింది. గత మూడు పర్యాయాలుగా ఫలితాలను పరిశీలిస్తే ఒకసారి గెలిచిన పార్టీ మరోసారి గెలువలేదు. దీంతో ఈ ఎన్నికల్లో అదే పరిస్థితి పునరావృతం అవుతుందా.. లేని పక్షంలో రిజల్ట్ ఏ విధంగా ఉంటుందని జనాలు గమనిస్తున్నారు.

ఎస్టీ రిజర్వ్ నుంచి ఫలితాలు ఇలా..

2009 లోక్‌సభ ఎన్నికల నుంచి ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ ఎస్టీ రిజర్వ్‌డ్ అయింది. అంతకు ముందు ఇది జనరల్ స్థానంగా కొనసాగింది. ఆ ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్ మధ్య పోరు నెలకొనగా టీడీపీ విజయం సాధించింది. ఆ తర్వాత 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఈ స్థానం నుంచి బీఆర్ఎస్ గెలుపొందింది. కాంగ్రెస్ రెండో స్థానంలో నిలవగా టీడీపీ మూడో స్థానానికి పడిపోయింది. ఇక 2019లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ అనూహ్యంగా బీజేపీ గెలిచింది. బీఆర్ఎస్ రెండో స్థానానికి, కాంగ్రెస్ మూడో స్థానానికి పడిపోయింది.

ఈ సారి ఫలితాలు ఎలా..

ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉంటాయనే విశ్లేషణ సాగుతోంది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని నాలుగు నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపొందింది. కాషాయ జెండా రెపరెపలాడింది. 2019లో పార్లమెంట్ ఎన్నికల రిజల్ట్ తర్వాత అసెంబ్లీలో తొలిసారిగా ఇక్కడి నుంచి బీజేపీ అభ్యర్థులు గెలుపొందడం ఈ ఎన్నికలకు ఆ పార్టీకి మరింత బూస్ట్‌ను ఇచ్చింది. కమలం పార్టీ సిట్టింగ్ స్థానాన్ని తిరిగి గెలుపొందుతుందని ఆ పార్టీ కార్యకర్తలు ఘంటాపథంగా చెబుతున్నారు. మరి ఎస్టీ రిజర్వ్ తర్వాత వరుసగా ఒక పార్టీకి గెలుపు దక్కని నేపథ్యంలో ఈసారి ఎలా ఉండబోతుందోనని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

మూడు పర్యాయాలు బరిలో నిలిచిన రాథోడ్..

గత మూడు పర్యాయాలు ఆదిలాబాద్ పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ బరిలో నిలవడం గమనార్హం. 2009లో టీడీపీ నుంచి పోటీలో నిలిచి గెలుపొందారు. తొలిసారిగా ఎంపీ అయ్యారు. 2014లోనూ టీడీపీ నుంచే బరిలోకి దిగారు. అయితే ఓటమి పాలై మూడో స్థానానికి పరిమితం అయ్యారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలోకి దిగిన రాథోడ్ రమేశ్ అప్పుడు కూడా మూడో స్థానానికే పరిమితం అయ్యారు. ఈసారి బీజేపీ నుంచి టికెట్ కోసం విస్తృతంగా ప్రయత్నాలు చేసినప్పటికీ ఆయనకు నిరాశ ఎదురైంది. తాజాగా ఆయన అభ్యర్థి గోడం నగేశ్‌ను ఎన్నికల్లో గెలిపించేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. కాగా, ఎస్టీ రిజర్వ్‌డ్ అయిన తర్వాత ఎంపీలుగా గెలిచిన ముగ్గురు కూడా ఈ సారి ఒకే పార్టీలో ఉండటం గమనార్హం. రాథోడ్ రమేశ్, గోడం నగేశ్, సోయం బాపురావు ముగ్గురు యాదృచ్ఛికంగా బీజేపీలో కొనసాగుతుండటం విశేషం.

ముమ్మర తనిఖీలు



పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోలీసులు అడుగడుగునా తనిఖీలు చేపడుతున్నారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్, దిగ్రస్ ప్రాంతంలో మహారాష్ట్ర పోలీసులు తనిఖీలు చేపట్టారు. నిరాల ప్రాంతంలో తెలంగాణ పోలీసులు సైతం వాహనాల్లో తనిఖీలు చేస్తూ కనిపించిన చిత్రాలు. సీసీ కెమెరాలు పెట్టుకుని ప్రభుత్వ వాహనంపై అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేస్తుండడం గమనార్హం. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



వాహనాలు తనిఖీ చేస్తున్న తెలంగాణ పోలీసులు

సుగుణను భారీమెజార్టీతో గెలిపిద్దాం



మాట్లాడుతున్న సత్తు మల్లేశ్

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సత్తు మల్లేశ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్, బోథ్ ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడె వసంత్‌రావు, బోథ్ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అల్లూరి ప్రఫుల్‌చందర్‌రెడ్డి, నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, వకీల్, జాదవ్ కపిల్‌దేవ్, నాయిడి రవి, పాల శంకర్, బద్దం పోతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ఓ కిరాణా దుకాణంలో గంజాయిని శనివారం రాత్రి పట్టుకున్నట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. పక్కా సమాచారంతోనే గ్రామానికి చెందిన బండం రాజు కిరాణా దుకాణంలో దాడి చేసి 500 గ్రాముల ఎండిన గంజాయితోపాటు స్మోకింగ్ రోలింగ్, కోన్స్‌పేపర్లు లభించినట్లు తెలిపారు. అతని స్నేహితులు ఇర్ఫాన్, బిలాల్‌తో కలిసి మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి అమ్ముతున్నారని పేర్కొన్నారు. వీరిని అదుపులో తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

నగదు స్వాధీనం

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. గోదావరిఖనికి చెందిన అల్లివర్ అర్జున్ బోలెరో ఆపి తనిఖీ చేయగా లభించిన రూ.98,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును ఎస్ఎస్‌టీ సిబ్బందికి అప్పగించి కేసునమోదు చేసినట్లు కాసిపేట ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఎస్ఎస్‌టీ సిబ్బంది, డెప్యూటీ తహసీల్దార్ మాణిక్‌రావు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చెన్నూర్: పట్టణంలోని బేతాళవాడలో గల ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఆదివారం రాత్రి దాడి చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.6,600 నగదు, రెండు మోటర్ సైకిళ్లు, ఒక సెల్‌ఫోన్‌తో పాటు పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

బాసర ఆలయంలో ఆర్జేసీ తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్జేసీ కృష్ణవేణి

భైంసా: బాసర జ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం రీజినల్ జాయింట్ కమిషనర్, విజిలెన్స్ అధికారిణి కృష్ణవేణి తనిఖీలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆమె రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరు తెలుసుకున్నారు. ఈవో విజయరామారావుతో పలు విషయాలపై చర్చించారు. అనంతరం ప్రసాదాల తయారీ కేంద్రానికి వెళ్లారు. లడ్డూ తయారీ కోసం వినియోగిస్తున్న జీడిపప్పు, పంచదార, శెనగపప్పుతోపాటు స్టాక్‌రూమ్‌లో నిల్వలు పరిశీలించారు. ప్రసాదాల తయారీలో రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కొన్నేళ్లుగా ఆలయంలో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని, భక్తులను పట్టించుకోవడంలేదని ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఆర్జేసీ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. తనిఖీల్లో ఏమి తేలిందనే వివరాలు ఆమె వెల్లడించలేదు. ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తులకు అందుతున్న సేవలపై ఆరా తీసినట్లు సమాచారం.

ఆర్కేపీ సీహెచ్‌పీ మరో రికార్డు

- ఒక్కరోజులోనే ఏడు రేకుల బొగ్గు రవాణా

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సీహెచ్‌పీ కార్మికులు అద్భుతమైన రికార్డులను సృష్టిస్తున్నారు. బొగ్గు రవాణాలో కీలకంగా వ్యవహరించి ఈ ఆర్థిక సంవత్సరం అత్యధిక రేకుల సరఫరా చేసి గతంలో ఉన్న పలు రికార్డులను బద్దలు కొట్టారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను 22 లక్షల 3 వేల టన్నుల లక్ష్యాన్ని ఇక్కడి సీహెచ్‌పీకి నిర్దేశిస్తే వారం రోజుల ముందుగానే నిర్దేశిత లక్ష్యం కన్నా 7 లక్షల టన్నుల బొగ్గు అధనంగా రవాణా చేసి రికార్డును సృష్టించారు. మొత్తం 130 శాతం బొగ్గు రవాణా చేసి సత్తాచాటారు. అలాగే మార్చి 30న(శనివారం) ఒక్కరోజే ఏడు రేకుల బొగ్గు రవాణా చేశారు. దాదాపు 28 వేల టన్నుల బొగ్గును ఒక్కరోజులోనే రవాణా చేసి శభాష్ అనిపించుకున్నారు. సమష్టి కృషితో అత్యధిక టన్నుల బొగ్గును సకాలంలో రవాణా చేస్తున్న సీహెచ్‌పీ కార్మికులను ఏరియా జీఎం మనోహర్, సీహెచ్‌పీ డీజీఎం బాలాజీ భగవతి అభినందించారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని విశ్వనాథ్‌పేట్ సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందినట్లు రూరల్ ఎస్సై సాయికుమార్ తెలిపారు. 75 ఏళ్ల వయసు గల వృద్ధుడు భిక్షాటన చేస్తూ..అక్కడే షాపు వద్ద రాత్రి నిద్రిస్తున్నాడు. ఆదివారం ఉదయం వృద్ధుడు మృతి చెందగా కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన వృద్ధుడు గోధుమ కలర్ షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని బిలోలి గ్రామానికి చెందిన యువకుడు జోగోల్ల ప్రశాంత్ (24) చెరువులో దూకి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజు కథనం ప్రకారం.. ప్రశాంత్ కొంతకాలంగా మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సౌజన్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..



గంగాధర్ (ఫైల్)

కుభీర్: మండలంలోని న్యూ సాంవ్లి గ్రామానికి చెందిన జంగి గంగాధర్ (45) మద్యానికి బానిసై శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై పీ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర్ మద్యానికి బానిసయ్యాడు. అప్పుడప్పుడు కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. శనివారం మధ్యాహ్నం మద్యం తాగిన మైకంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి తండ్రి గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడి..

వాంకిడి: మద్యానికి బానిసైన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని సోనాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొడప రాము(25)కు రెండేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన రంబబాయితో వివాహం జరిగింది. కొన్ని రోజులుగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. హోలీ పండుగ రోజు భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసైన రాము ప్రతీరోజు తాగి వచ్చి ఇంట్లో తల్లి మెంగుబాయితో గొడవపడేవాడు. భార్యను నువ్వే ఏదో అని ఉంటావు అందుకే పుట్టింటికి వెళ్లిపోయిందని తల్లిని కొట్టేవాడు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం గ్రామస్తులతో కలిసి చేపలు పట్టేందుదు గ్రామసమీపంలోని వాగు వద్దకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి అత్తారింటికి వెళ్లాడు. రాత్రి అక్కడే భోజనం చేసి నిద్రపోయాడు. ఆదివారం తెల్లవారు జాము తన ఇంటికి వచ్చాడు. ఉదయం 7 గంటల సమయంలో తల్లి మెంగుబాయి ఇంట్లోకి వెళ్లి చూడగా రాము ఉరేసుకుని దూలానికి వేలాడుతూ కనిపించాడు. తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

రెండు కార్లు ఢీకొని పలువురికి గాయాలు

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రి గ్రామ సమీపంలో ఇచ్చోడ, బజార్‌హత్నూర్ ఆర్అండ్‌బీ రోడ్డులో శనివారం రాత్రి రెండు కార్లు ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. బజార్‌హత్నూర్ వైపు నుంచి ఇచ్చోడకు షిఫ్ట్ డిజైర్ కారును అతి వేగంగా నడిపిన షేక్ కలీం, ఎదురుగా ఇచ్చోడ నుంచి సోనాలకు వస్తున్న బాలెనో కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రెండు కార్లు ధ్వంసం కాగా, బాలెనో కారులో ప్రయాణిస్తున్న రాథోడ్ అర్జున్‌నాయక్, అతని కుటుంబ సభ్యులు ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని అంబులెన్సులో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. రాథోడ్ అర్జున్‌నాయక్ ఫిర్యాదు మేరకు షేక్ కలీంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరు మృతి

ఆదిలాబాద్‌టౌన్: కుమురం భీం జిల్లా లింగాపూర్ మండలం పిట్టగూడకు చెందిన ఉర్వేత లక్ష్మణ్ (50) శనివారం మృతిచెందాడు. వన్‌టౌన్ ఎస్సై నజీర్ కథనం ప్రకారం.. ఉర్వేత లక్ష్మణ్ ఆదిలాబాద్‌లోని వినాయక్ చౌక్ ప్రాంతంలో నీటి ట్యాంక్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు రిమ్స్‌కు తరలించగా అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా ఈయన ఈనెల 29న తన ఇంటి నుంచి మహారాష్ట్రకు వెళ్లేందుకు బయల్దేరి వచ్చాడు. ఎండ తీవ్రత కారణంగా మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయలయ్యాయి. ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం.. పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన షేక్ అయాజ్‌గా కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బైక్‌పై పొన్నారి నుంచి ఆదిలాబాద్ వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ట్రాలీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అంబులెన్స్‌లో ఆయన్ను రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఎస్సై వివరించారు.

కారు బైక్ ఢీకొని ఇద్దరికి..

ఆసిఫాబాద్అర్బన్: మండలంలోని బురుగుడా బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని చిలాటిగుడా గ్రామానికి చెందిన సచిన్, చింతలమానెపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన తిరుపతి బైక్‌పై వస్తుండగా మంచిర్యాల వైపు నుంచి ఆసిఫాబాద్‌కు వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో సచిన్, తిరుపతికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వడదెబ్బతో హమాలీ కార్మికుడి మృతి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోయవాగు గ్రామానికి చెందిన లెంకె సురేశ్ (40) వడదెబ్బతో ఆదివారం మృతిచెందారు. గత కొంతకాలంగా భార్యపిల్లలతో దూరంగా ఉంటున్న సురేశ్ హమాలీ కార్మికుడిగా పనిచేస్తూ ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్నారు. ఈమేరకు పట్టణ ఎస్సై అంజన్న.. మృతదేహాన్ని స్థలాన్ని పరిశీలించి వడదెబ్బతో మృతిచెంది ఉంటాడని తెలిపారు.